
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 22 మార్చి 2025
5
అన్నమయ్య



ప్రతిభ చాటిన ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

పుంగనూరు రోడ్డులోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విద్యార్థులు వివిధ ఇంటర్ కాలేజ్ జాతీయ టెక్నికల్ పోటీలలో పాల్గొని ప్రతిభ చూపి బహుమతులు సాధించారని డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగ రెడ్డి తెలిపారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను అభినం దించారు. మిగిలిన విద్యార్థులు కూడా అన్ని రంగాలలో పాల్గొని సత్తాచాటాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్‌బాబు, ఇసిఇ హెచ్ఒడిలు డాక్టర్ కె.వి.వరప్రసాద్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్ రామలింగారెడ్డి

జోరుగా నీటి వ్యాపారం

- జిల్లా కేంద్రమైనా కొనాల్సిందే
- అదుపులో లేని ధరలు
- అవస్థల్లో పట్టణ ప్రజలు
- పట్టని అధికారులు



ప్రజాశక్తి- రాయచోటి

రాయచోటి జిల్లా కేంద్రమైనా కొన్నేళ్ల నుంచి ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. వేసవికాలం వచ్చిందంటే తాగునీటి కోసం ఇబ్బందులు తప్పడం లేదు. డబ్బులు పెట్టి నీరు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. మున్సిపల్ పరిధిలో 34 వార్డులున్నాయి. జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా మినరల్ వాటర్ ప్లాంట్లు దాదాపు 45 ఉన్నాయి. ఇందులో ఏ ఒక్క ప్లాంట్‌కు అనుమతి లేదు. పట్టణం లో 25 వేల గృహాలు, లక్షకు పైగా జనాభా ఉన్నారు. అయినప్పటికి నేటికి తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు మారినా నీటి కష్టాలు తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. నీటి సమస్యపై శాశ్వత పరిష్కారం ఆలోచించే ప్రజా ప్రతినిధి కానీ, అధికారులు కానీ లేరని, పలువురు విమర్శిస్తున్నారు. పట్టణ ప్రజల అవసరాల కోసం వెలిగల్లు ప్రాజెక్టు నుంచి గతంలో నాలుగు, ఐదు రోజులకు ఒక్కసారి నీటిని వదిలేవారు. ప్రస్తుతం ఏడు,ఎనమిది రోజులకు ఒక్కసారి సరఫరా చేస్తున్నారు. అదీ ఒక గంట మాత్రమే వదలడంతో అవి చాలక పోవడంతో వాటర్ ప్లాంట్లను ఆశ్రయిస్తున్నారు. నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతూ సచివాలయాల వద్ద సంబంధిత అధికారులకు విన్నవించుకుంటూ నిరసనలు చేపడుతున్నారు. వచ్చే నీటిని గంటపాటు కాకుండా మరికొంత సమయం ఎక్కువగా వచ్చేలా చూడాలంటూ వేడుకుంటున్నారు. అది కూడా ముందస్తు సమాచారం లేకుండా నీటిని ఏ సమయంలో వదులుతారో తెలియక ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. నీటి ఏదైనా ఒక సమయం కేటాయించి ఆ సమయంలో వదలాలని పలువురు వినిపించుకుంటున్నారు. నాయకులు మారినా తమ తల రాతలు మాత్రం మారడం లేదని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు 30 సంవత్సరాల నుంచి రాయచోటి ప్రాంతంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పార్టీలు ఎన్నికల ముందు తాగునీటి సమస్యపై హామీలిచ్చి ఓట్లు దండుకుని గద్దెనెక్కిన తరువాత ఆ సమస్యను గాలికి వదిలేస్తున్నారు. ప్రస్తుతం 20 లీటర్ల క్యాన్ రూ.20, 25 లీటర్ల క్యాన్ రూ. 25. బిందె రూ.15, కూల్ వాటర్ క్యాన్ రూ.90 చొప్పున వసూలు చేస్తున్నారు. ప్రస్తుతం నీటి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతుంది. మినరల్ వాటర్‌ను చిన్నచిన్న వాహనాల్లో స్టీల్ డ్రములతో ఉంచుకుని విధుల్లో తిరుగుతూ విక్రయిస్తున్నారు. ఉదయం నిద్ర లేచిన వెంటనే తాగునీటి కోసం ప్రజలు ఎదురు చూస్తుంటారు. ఉద్యోగాలకు వెళ్లేవారు, వ్యాపారాలు చేసుకునేవారు, కూలీలు చేసుకునేవారు తప్పని సరిగా నీటిని కొనుగోలు చేసి పనులకు వెళ్లాల్సిన పరిస్థితి రాయచోటి ప్రాంతంలో నెలకొంది. గతంలో రూపాయి ఇచ్చి తాగునీటి ప్యాకెట్లను కొని తాగేవారు. మున్సిపల్ అధికారులు ప్లాస్టిక్ నిషేధించడంతో రైతులు, వ్యాపారులు బయట ప్రాంతాలనుంచి వచ్చి దాహార్తిని తీర్చుకోవాలంటే రూ.పది పెట్టి తప్ప నిసరిగా అర లీటర్ల బాటిల్ కొని తాగాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి వచ్చిందంటే తాగు నీటి సమస్య ఈ ప్రాంతం లో తీవ్రంగా ఉంటుంది. గతంలో తాగునీటి సమస్య ఉన్నప్పుడు స్వచ్ఛంద సంస్థ ద్వారా ప్రజలకు ట్యాంకర్లతో వీటిని సరఫరా చేసేవారు.ప్రస్తుతం గుక్కెడు నీరు ఉచితంగా ఇచ్చే పరిస్థితి ఎక్కడ కనిపించడం లేదు. గతంలో పట్టణంలో పలు ప్రాంతాలలో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి ఎక్కడ కూడా కనిపించడం లేదు.

జిల్లాగా ఏర్పడి మూడేళ్లవుతున్నా..

రాయచోటి జిల్లాగా ఏర్పడి మూడేళ్లవుతున్నా నేటికీ మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం. దీనికి తోడు రాయచోటిలో నీటి వ్యాపారం మరింత ఊపందుకుంది. మున్సిపల్ అధికారులు అనుమతులు లేని మినరల్ వాటర్‌ప్లాంట్లపై శ్రద్ధ చూపకపోవడంలో అంతర్యం ఏమిటి అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా నీటి వ్యాపారం జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కూడా ప్లాంట్ వద్దకు వెళ్లి సక్రమంగా మినరల్స్ నీటిని శుద్ధి జరుగుతున్నదా లేదా అని గమనించిన పాపన పోలేదు. కొందరు ఏకంగా మినరల్ వాటర్ పేరు చెప్పి. బోర్ల వద్ద నీటిని నింపుకొని ఆ నీటిని ప్రజలకు అమ్ముతూ సొమ్ము చేసుకుం టున్నారు. అయినప్పటికీ ప్రజలు మినరల్ వాటర్ అని నమ్మి వారిచ్చే నీటిని కొన్ని తాగుతున్నప్పటికీ కొందరు అనారోగ్యాల గురవుతున్నట్లు సమాచారం.

33వ వార్డులో పైపులైన్ లేదు..

మున్సిపల్ పరిధిలో 33 వ వార్డులో వెలిగల్లు ప్రాజెక్ట్‌కు సంబంధించిన పైపు లైన్‌కు ఇప్పటి వరకు సరఫరా అందించక పోవడం శోచనీయం. ఈ వార్డులోని ఇందిరమ్మ కాలనీలో 450, గొల్లపల్లిలో 250, ఎగువ అబ్బవరంలో 80 కుటుంబాలు నివాసం ఉన్నారు. తమ మున్సిపల్‌టికి సంబంధించిన అన్ని అన్ని పన్నులు కడుతున్నామని, కానీ తమ ఇంటి దగ్గరికి వెలిగల్లు నీరు ఇంతవరకు సరఫరా చేయడం లేదు అని వారు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా కూలీ చేసుకనే వారు రోజు డబ్బులు పెట్టి తాగునీరు కొనాలంటే ఎంతో ఇబ్బంది పడుతున్నారు. నాయకులకు కానీ, అధికారులు కానీ, ఏ ఒక్కరూ ఆలోచించిన పాపాన పోలేదు. ఇప్పటికైనా తాగునీటి ధరలకు నియంత్రణ చేసి, అనుమతులు లేని వాటర్ ప్లాంటు తగిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నీటి ధరలను నియంత్రించాలి



శుద్ధి చేసిన వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేసి, నీటి ధరలను మున్సిపల్ అధికారులు వెంటనే నియంత్రించాలి. వెలిగల్లు నీటి సరఫరా చేసే సమయాన్ని ముందే గానే ప్రజలకు తెలియజేయాలి. నిత్యం ఉపయోగించే వెలిగల్లు నీటిని రెండు రోజులకు ఒకసారి వదలాలి.

- మారుతి శంకర్ , స్థానికుడు, ఎస్. ఎన్ కాలనీ, రాయచోటి.

మా దృష్టికి రాలేదు



మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ప్లాంట్‌లో మంచి నీటిని అధిక రేట్లుకు కమ్ముతున్నారని మా దృష్టికి రాలేదు. మున్సిపాలిటి వాటర్ ప్లాంట్ అన్ని పరిశీలించి సక్రమంగా శుద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటాం. వాటర్ ప్లాంట్ ద్వారా తాగునీటిని అధికరేట్లకు సరఫరా చేస్తున్నారని ప్రజలు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం. త్వరలో పట్టణంలోని అన్ని ప్లాంట్‌ను పరిశీలిస్తాం.

- వాసు బాబు, మున్సిపల్ కమిషనర్, రాయచోటి



ఇవిఎం గోడామును పరిశీలిస్తున్న కలెక్టర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు

పటిష్టమైన ఓటరు జాబితాకు కృషి

- కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎన్నికల ప్రక్రియను మరింత బలోపేతం చేయడానికి చట్టానికి అనుగుణంగా సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాజకీయ పార్టీలను కోరారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ, రాజ్యాంగం అమలులో రాజకీయ పార్టీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. పరిష్కారం గాని ఏవైనా సమస్యలకు సంబంధించి భారత ఎన్నికల సంఘం అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి సూచనలు ఆహ్వానిస్తోందన్నారు. భారత ఎన్నికల సంఘం సూచించిన ప్రజా ప్రాతినిధ్య చట్టం, ఓటర్ల నమోదు నియమాలు, ఎన్నికల నియమాల నిర్వహణ, సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు జారీ చేసే సూచనలు, మాన్యువల్స్, హ్యాండ్ బుక్కులు అంశాలపై అన్ని జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల నుంచి ఏప్రిల్ 30 నాటికి సూచనలు, సలహాలు అందజేయాల్సి ఉందన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలు అనుసరించి జిల్లాలో పటిష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను తప్పనిసరిగా నియమించుకోవాలన్నారు. పోలింగ్ బూతు లెవెల్, గ్రామస్థాయిలలో సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను దృష్టికి తీసుకురావాలని కోరారు. వయోజనులు, యువత ఓటర్ల నమోదు శాతం పెరిగేందుకు కూడా రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికల నిర్వహించడానికి బలమైన, పారదర్శక ఎన్నికల ప్రక్రియ ఏర్పాటు కోసం రాజకీయ పార్టీలన్నీ తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు మాట్లాడుతూ గత ఏడాది జరిగిన సార్వత్రిక ఎన్నికలలో రెండు చోట్ల ఇవిఎంలనును పగలగొట్టేందుకు ప్రయత్నించారని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. 1200 పైగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను విభజించినపుడు సదరు సమాచారాన్ని రాజకీయ పార్టీలకు అందించాలని కోరారు. పోలింగ్ కేంద్ర భవనాల మార్పు, పోలింగ్ కేంద్రాలలో సమస్యల గుర్తింపు, బిఎల్ఎ లను మార్చుకునే అంశం తదితరాలను సమావేశంలో కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వాటన్నిటికీ కలెక్టర్ తగు సమాధానాలు తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న ఇవిఎం గోదామును రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ సందర్శించారు. గోదాములోని ఇవిఎంలు, బియు, సియు, వివి ప్యాట్‌లను వారు పరిశీలించారు. కార్యక్రమంలో డిఆర్‌ఇ మధుసూదన్‌రావు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రెడ్డప్పరెడ్డి, తాహశీల్దార్ నరసింహకుమార్, వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

స్థానిక పట్టణంలో నేతాజీ సర్కిల్ దగ్గర గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణను కలెక్టర్ చామకూరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్ తదితర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిం చాలని ఆదేశించారు. అనంతరం వివిధ శాఖల అధికారులకు తమ సూచనలు చేశారు. ఈ తనిఖీలో డిఇఒ సుబ్రహ్మణ్యం, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విస్తృతంగా ఫారంపాండ్ పనులు : కలెక్టర్

ప్రజాశక్తి-రాయచోటి

ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా ఫారంపాండ్‌లను పనులను విస్తృతంగా ప్రారంభించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం విజయవాడలోని సచివాలయం నుంచి ప్రపంచ జల దినోత్సవం, పల్లె పండుగ పనుల ప్రగతిపై జిల్లా కలెక్టర్లు, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల అధికారులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. విసి అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నీటి సంరక్షణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పారం పాండ్ గ్రౌండింగ్ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలో 11 వేల పారం పాండ్లు నిర్మించడం లక్ష్యం కాగా ఇప్పటివరకు 7432 ఏర్పాటుచేసి 68 ప్రగతి సాధించారని అన్నారు. పల్లె పండుగలో చేపట్టిన గోకులం షెడ్లు 1200 లక్ష్యానికి గాను 1112 నిర్మించి 92.67శాతం, సిసి రోడ్లలో 177.76కిమీలు లక్ష్యానికి 133.41కిమీ లు నిర్మించి 75శాతం ప్రగతి సాధించినట్లు పేర్కొన్నారు. లక్ష్యం మేరకు తప్పనిసరిగా ప్రగతి సాధించాలని, పనుల నాణ్యతలో రాజీ పడరాదని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో డ్వామా పీడీ వెంకటరత్నం, పంచాయతీరాజ్ ఎస్ఇ దయాకర్ రెడ్డి, ఇన్‌ఛార్జి డిపిఒ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పోటాపోటీగా బార్ అసోసియేషన్ ఎన్నికలకు నామినేషన్లు

ప్రజాశక్తి-రాయచోటి

ఆంధ్రప్రదేశ్ బార్‌కౌన్సిల్ ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మార్చి నెలలో జరిగే బార్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా ఈనెల 29న జరగబోయే రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు గురు, శుక్ర వారాలలో పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. రాయచోటి బార్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షులుగా ఉన్న ఎన్.ప్రభాకర్ రెడ్డి మరొకసారి ఎన్నికల్లో అధ్యక్షులుగా పోటీ చేయడానికి శుక్రవారం తన మద్దతుదారులైన న్యాయవాదులతో కలిసి ఎన్నికల అధికారి రాజ్‌కుమార్‌రాజు ఎదుట నామినేషన్ దాఖలు చేశారు. ఆయన ప్యానెల్ లోనే ప్రధాన కార్యదర్శిగా పోటీ చేయడానికి పి.రెడ్డి భాషా , స్పోర్ట్స్ కార్యదర్శిగా పోటీ చేయడానికి వి. సిద్దయ్య కూడా శుక్రవారం నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్.ప్రభాకర్ రెడ్డికి పోటీగా వై రమేష్ రెడ్డి అధ్యక్షుడుగాను ప్రధాన కార్యదర్శిగా పోటీ చేస్తున్న పి.రెడ్డిభాషాకు పోటీగా పి. శ్రీనివాసులు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ తాత్కాలిక అధ్యక్షులుగా కొనసాగుతున్న ఎన్.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి పాత కోర్టు స్థానంలోనే నూతన కోర్టు భవనాలను నిర్మించాలని ఒక ప్రధానమైన అజెండాతో బార్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నామని కోర్టు నూతన భవనాల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయడానికి పని చేస్తామని అన్నారు. ప్రభాకర్ రెడ్డికి మద్దతుగా వచ్చిన వారిలో భారత న్యాయవాదుల సంఘం ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు టీ.ఈశ్వర్, ఐఎఎల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆనందకుమార్, సీనియర్ న్యాయవాదులు రఘురామిరెడ్డి, దేవేందర్ రెడ్డి, చిన్నయ్య, ధనుంజయ్ కుమార్, రెడ్డప్ప రెడ్డి, పి.రెడ్డయ్య, డి.నాగ ముని, ఖాదర్‌బాషా, రామ్మోహన్ రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఎన్.ప్రభాకర్ రెడ్డి, సభ్యులు

నిరుద్యోగ యువతకు అద్భుత అవకాశాలు

-342 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-రాయచోటి

రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు పూర్తి స్థాయిలో ఉపాధి కల్పించేందుకు విశేష కృషి చేస్తుందని నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీసాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా యువత నుంచి అనూహ్య స్పందన వచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో మెగా జాబ్ మేళాలు నిర్వహిస్తోందని తెలిపారు. చిన్న ఉద్యోగమైనా నిరాశ పడకుండా, అంచెలంచెలుగా ఎదగాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. త్వరలో జిల్లాలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సహకారంతో మరిన్ని జాబ్ మేళాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. క్రమశిక్షణ, నైపుణ్యం, కష్టపడే మనస్తత్వం ఉంటే ఉద్యోగ అవకాశాలు వారికి చేరువ అవుతాయని సూచించారు. ఈ మెగా జాబ్ మేళాకు దాదాపు 646 మంది నిరుద్యోగులు హాజరై, అందులో 342 మంది అభ్యర్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం గర్వకారణమని జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగార్జున వెల్లడించారు. జాబ్ మేళాకో హాజరైన నిరుద్యోగ యువతకు మండపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాటు చేశారు. మెగా జాబ్ మేళాలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ నాగార్జున, జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ, డైరెక్టర్ రాజపుత్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బాలాజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

'అన్నమాచార్య ఫార్మసీ'లో క్యాంపస్ నియామకాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో సైంటిఫిక్ ఈరెవనా ప్రయివేట్ లిమిటెడ్ వారిచే క్యాంపస్ నియామకాలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.స్వర్ణలత తెలిపారు. ఈ క్యాంపస్ నియామకాలకు సైంటిఫిక్ ఎల్వీనా ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ వారి హెచ్ఆర్ టీం బృందం ఉపాధ్యక్షులు నవీన్‌కుమార్, ఫ్లోర్ హెడ్ జి శ్రావణి, టీం లీడర్ నితీష్‌కుమార్, సీనియర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ బి.ప్రశాంతి కళాశాలకు విచ్చేసి సుమారు 80 మంది విద్యార్థులకు నియామకాలు మొదటి దశలో రాత పరీక్ష నిర్వహించి అందులో 60 మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి బృంద చర్చ నిర్వహించారు. ఎంపికైన వారికి మౌఖిక పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కళాశాల నియామక సమన్వయకర్త యు.నరసింహులు, వారి బృందం డాక్టర్ ఎం.హంజా బేగ్, ఇతర కళాశాల సిబ్బంది ఈ నియామక కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ నియామకాలలో ఉద్యోగాలు సాధించిన వారికి ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అను ఉద్యోగంతో సుమారు మూడు లక్షల ప్యాకేజీ సంవత్సరానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ నియామకాలలో బి ఫార్మసీ, ఫార్మాడి విద్యార్థులు పాల్గొన్నారు.

'మిట్స్'లో ఘనంగా మేధో సంపత్తి యాత్ర

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (మిట్స్) కలశాలలో మేధో సంపత్తి (ఐపి) యాత్ర శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథులు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ఆర్ఆర్ఆర్ ఎడ్యుకేషనల్ అకాడమి అధ్యక్షులు నాదేళ్ల ద్వారకనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జె. ఎ. చౌదరి మాట్లాడుతూ ఇంటెలెక్టుల్ ప్రాపర్టీ రైట్స్ విలువ అవసరం ఎంతైనా ఉందని, ప్రతి ఒక్కరు వీటిపై అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. ప్రతి టెక్నాలజీకి కమ్యూనికేషన్ చాలా అవసరమని చెప్పారు. కనెక్ట్, కొల్లాబరేషన్, సెలెబ్రేషన్, మెంటరింగ్, డబ్బు, మార్కెట్ యాక్సిస్ అవసరమని తెలియజేశారు. ఎంఎస్ఎంఇ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.ఎల్.ఎస్. రెడ్డి మాట్లాడుతూ మేధో సంపత్తి యాత్ర మొదట కళాశాలలో ప్రారంభించామని విద్యార్థులు పారిశ్రామిక వ్యక్తులుగా అభివృద్ధి చెందడానికి కావాల్సిన అన్ని సహకారాలు అందిస్తామని, అవకాశాల్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కరెస్పాండంట్ డాక్టర్ ఎన్. విజయ భాస్కర్ చౌదరి, ప్రిన్సిపల్ డాక్టర్ సి. యువరాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో నిర్లక్ష్యం తగదు

-ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైద్య వృత్తిలో నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ముదివేడులో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తిని ఆస్పత్రికి తీసుకొస్తే సకాలంలో వైద్యం అందించకుండా నిర్లక్ష్యం వహించడంతోనే మృతి చెందాడని ఆరోపిస్తూ శుక్రవారం కుటుంబ సభ్యులు, బంధువులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి లో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఒపిలలో డాక్టర్లు ఎవ్వరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వైద్యులు, వైద్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్య వృత్తి చాలా పవిత్రమైనదని చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ప్రాణాలు కాపాడే ప్రత్యక్ష దైవమే డాక్టర్ అన్నారు. అలాంటి పవిత్రమైన, బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్నవారు జీతం కోసం కాకుండా అంకితభావంతో పనిచేయాలని అన్నారు. వైద్య వృత్తిలో నిర్లక్ష్యం అంటే ఓ నిండు ప్రాణాన్ని బలిగొనడమేనన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వాస్పత్రి లో వైద్యులు, వైద్య సిబ్బంది చికిత్సలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజల నుంచి ఎక్కువ గా ఫిర్యాదులు రావడం బాధాకరమని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. డాక్టర్ల కొరత గురించి, డాక్టర్ల సమస్యల గురించి తెలుసుకున్నారు. ఉన్నతాధికారులు, ఆరోగ్య శాఖామంత్రితో మాట్లాడి సమస్యలు లేకుండా చేస్తామని అన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించకుండా సేవలందించాలని, మెరుగైన సేవలతో ఆస్పత్రికి గుర్తింపు తీసుకురావాలని మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ఎంఒ, వైద్యులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

చందాదారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : చందాదారుల ఆర్థికాభివృద్ధే కపిలేశ్వర్ చిట్స్ ఇండియా ప్రయివేట్ లిమిటెడ్ లక్ష్యమని మేనేజింగ్ డైరెక్టర్ సికె.నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం కపిలేశ్వర్ చిట్ ఫండ్స్‌లో కొత్తగ్రూపుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎండి మాట్లాడుతూ గత 11ఏళ్లుగా చందాదారులకు నమ్మకమైన సేవలందించామని, ఇందుకు సహకరించిన ఏజెంట్లు, చందాదారులకు కృతజ్ఞతలు తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల రెండేళ్లుగా కొత్త గ్రూపులు ఏర్పాటు కాలేదని, తిరిగి కొత్తగ్రూపుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టడం సంతోషంగా ఉందన్నారు. ప్రొద్దుటూరు ముఖ్యకేంద్రంగా రాయలసీమ జిల్లాల్లో నాలుగు బ్రాంచులు కలిగి, చందాదారులకు విశేషమైన సేవలు అందిస్తున్న సంస్థ కపిలేశ్వర్ చిట్ ఫండ్స్ అన్నారు. ప్రొద్దుటూరు, తిరుపతి చిత్తూరు, మదనపల్లి కేంద్రాలలో తమ సంస్థ సేవలు అందిస్తోందన్నారు. ముఖ్యంగా ప్రొద్దుటూరులో 68.50కోట్ల వ్యాపారాన్ని సాధించిన ఏకైక సంస్థ అన్నారు. తమ సంస్థలో చిన్న మొత్తంలో పొదుపు చేస్తే, పెద్ద మొత్తంలో అవసరాలను తీరుస్తుందన్నారు. చిట్ ఎత్తిన నెలలోపే మొత్తం నగదును అందించడం మా సంస్థ ప్రత్యేకతన్నారు. మున్ముందు చందాదారులకు నాణ్యమైన సేవలు అందించి, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే తమ సంకల్పమన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కామకోటి ప్రసాద్‌రావు, సూర్య ఆస్పత్రి నిర్వాహకులు జాన్, శశి బ్రాంచ్ మేనేజర్ నరసింహులు, ఏజెంట్లు రాజగోపాల్ రెడ్డి, శ్రీనివాసులు, వెంకట్, సుబ్రమణ్యం, కుమార్, రమేష్ కార్యాలయపు సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులు కల్పించండి

ప్రజాశక్తి-పీలేరు : వైద్య ఆరోగ్య శాఖ కేడర్ల ఖాళీలను ఉద్యోగోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. అహరూన్, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు లక్ష్మీనారాయణ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ బి.రామగిడ్డయ్యను కోరారు. శుక్రవారం వారు కడపలో వైద్య ఆరోగ్యశాఖ సంచాలకులను కలిసి కడప జోన్ పరిధిలోని వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పనలో ఆలస్యం ఆలస్యమవుతోందని అన్నారు. అన్ని కేడర్ల సీనియారిటీ జాబితాలను వెంటనే విడుదల చేసి అభ్యంతరాలను తెలియచేసే అవకాశం ఇవ్వాలని, అందుకు ముందస్తుగా జాబితాలను విడుదల చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు సంఘాలతో సమావేశం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి బాల కృష్ణ, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మినారాయణ, కర్నూలు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, సంపత్ కుమార్, అనంతపురం జిల్లా అధ్యక్షుడు షేక్ బాబా సాహెబ్, కడప జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, బాషా, వీరేంద్ర పాల్గొన్నారు.



పని భారం తగ్గించాలని ఎంపిడిఒ వినతి పత్రం అందిస్తున్న కార్యదర్శులు

పంచాయతీ కార్యదర్శులపై పని ఒత్తిడి తగ్గించండి

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పంచాయతీ కార్యదర్శులకు పని ఒత్తిడి తగ్గించి, పంచాయతీ అభివృద్ధికి సమయం కేటాయించేలా చూడాలని, పంచాయతీ కార్యదర్శుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డిని పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం వినతి పత్రం ద్వారా కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు వారి విధుల్లోని రోజువారి కార్యక్రమాలతో పాటు, గ్రామ సచివాలయం ద్వారా వివిధ రకాల సర్వేలైన మిస్సింగ్ సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, పర్ప్ ప్రమోహం సర్వే, హౌస్ హోల్డ్ జియోట్యాగింగ్, పి4 సర్వే, డెత్ వెరిఫికేషన్ సర్వే, పిఎంఎవై సర్వే, ఎన్‌పిసియల్ సర్వే, 0 నుంచి 6 సంవత్సరాల పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే, నాన్ ఎవిలిబిలిటీ సర్వే, విలేజ్ అసెట్ సర్వే, విలేజ్ ప్రొఫైల్ సర్వే వంటి సర్వేల్లో పాల్గొని సర్వే కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. అనేక సర్వేలు కారణంగా పంచాయతీ కార్యదర్శులు అధిక పని భారంతో అభివృద్ధికి సమయం కేటాయించలేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. తద్వారా గ్రామ పంచాయతీ పరిపాలన, అభివృద్ధి కుంటుపడుతోందని అన్నారు. పంచాయతీ పరిపాలన, అభివృద్ధి మరింత ముందుకు సాగాలంటే, పంచాయతీ కార్యదర్శులకు అధిక పని ఒత్తిడి, పని భారం నుంచి మినహాయింపు కలిగించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మారెప్ప, వెంకటరమణారెడ్డి, శ్రీనాథ్, రాజేష్, గాయత్రి, మమత, సౌరిన్ పాల్గొన్నారు.

నాణ్యమైన సరుకులు అందించాలి

ప్రజాశక్తి-రాయచోటి : వినియోగదారులకు నాణ్యతతో కూడిన నిత్యవసర సరుకులను సరసమైన ధరలకు అందించి వారి మన్ననలు పొందాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరులు టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని సుండుపల్లి రోడ్డు మార్గంలో హరిశ్చంద్ర నూతనంగా ఏర్పాటుచేసిన సూపర్ మార్కెట్ ప్రారంభోత్సవంలో పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్ కే మార్కెట్ నిర్వాహకులు వారి కుటుంబ సభ్యులు లక్ష్మీప్రసాద్ రెడ్డికి సాగర సాగ్వాగం పలికి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వ్యాపార రంగం లపై మక్కువ చూపించడం చాలా అభినందనీయమని అన్నారు. కొనుగోలు చేసేందుకు వచ్చేటువంటి వినియోగదారులకు సరైనటువంటి గౌరవ మర్యాదలతో సరుకులను విక్రయించే విధంగా నిర్వాహకులు నడుచుకోవాలని సూచించారు. ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

27 నుంచి ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన

-కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి : ఈనెల 27నుంచి 29 వరకు గుంటూరులో దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన 2024-25 ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ సహకారంతో గుంటూరు లాంలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న దక్షిణ భారత ప్రాంతీయ వ్యవసాయ ప్రదర్శన కార్యక్రమంలో రైతులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. ఈ ప్రదర్శనలో దక్షిణ భారత రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, కర్ణాటక, లక్షద్వీప్ నుంచి వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు, పారిశ్రామికవేత్తలు, రైతులు, రైతు సహకార సంఘాలు, ఎన్‌జిఒలు పాల్గొంటారని తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారుగా 200 పైగా ప్రదర్శన విభాగాలు ఏర్పాటు చేస్తారని, వివిధ పంటల్లో నూతన వంగడాలు, వ్యవసాయంలో నూతన సాంకేతిక పద్ధతులు, విలువ జోడింపు, యాంత్రికరణ, ఉద్యాన, పాడి, మత్స్య రంగాలలో నూతన సాంకేతికతలు ప్రదర్శన చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లాలోని రైతులను 295 ప్రదర్శనకు తీసుకురావలసిందిగా విశ్వవిద్యాలయం వారు తెలిపారని, జిల్లాలోని ఆసక్తి కలిగిన రైతులు (8008500320) ఈ నెంబరు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె తెలిపారు.

నవీన్ కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని పులమి కిషన్ మార్ట్ దుకాణంలో అకౌంటెంట్‌గా పనిచేసిన గుండ్లపల్లి పంచాయతీ చెట్లవారిపల్లి చెందిన పెద్ద వీరప్ప కుమారుడు నవీన్ కుమార్ గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మదనపల్లి జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తంబళ్లపల్లెకు తీసుకువచ్చి దుకాణం నడిరోడ్డుపై నిరసన ధర్నా చేశారు. షాపులో వ్యాపార లావాదేవీలలో మేనేజర్ అవకతవకలకు పాల్పడి అకౌంటెంట్ నవీన్ కుమార్ మృతికి కారణమయ్యారని ఆరోపించారు. మేనేజర్‌ను నగ్రంగా విచారించి నవీన్ కుమార్ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. నవీన్ కుమార్ కుటుంబ సభ్యులు గ్రామస్తులు, స్నేహితులు పెద్దఎత్తున ఈ నిరసన ధర్నాలో పాల్గొన్నారు.

వేలంలో రూ.43.90 లక్షల ఆదాయం

ప్రజాశక్తి-గాలివీడు : స్థానిక పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్పంచ్ మిట్టపల్లి లక్ష్మీదేవి అధ్యక్షతన జిల్లా పంచాయతీ అధికారి మస్తాన్‌వలి, ఇఒపిఆర్‌డి శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి ఆంజనేయనాయక్ ఆధ్వర్యంలో గాలివీడు వనరులకు వేలంపాట నిర్వహించారు. కూరగాయల సంత కె.గంగాధర్ నాయుడు రూ.14.03లక్షలు, కె.బాలప్పనాయుడు పశువుల సంత రూ.23.56లక్షలు, కె.గంగాధర్ నాయుడు బస్టాండ్ గేట్ వేలం పాట రూ.6,31లక్షలకు మొత్తం కలిపి రూ.43.90లక్షలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి సర్పంచ్ మండల వైస్ ఎంపిపి మిట్టపల్లి యదుభూషణరెడ్డి, వేలంపాట దారులు పాల్గొన్నారు.

బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులుకు సన్మానం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన గౌతమ్ కుమార్‌ను మదనపల్లె ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మదనపల్లి మున్సిపాలిటీ వైస్ చైర్మన్, లారీ వర్కర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జింకా వెంకటాచలపతి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలలో ఎన్నో పోరాటాలు చేసిన గౌతమ్ మదనపల్లె జిల్లా కోసం పోరాటాలు చేసి ఉద్యమాన్ని ముందుకు నడిపారన్నారు. బహుజన సమాజ్ పార్టీలో రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైనందున మదన పల్లె గౌరవ ప్రతిష్టలు నిల పాలని ఆకాంక్షించారు.

అంగన్వాడీలు సామర్థ్యాన్ని పెంచుకోవాలి

- ఐసిడిఎస్ పీడీ పి.రమాదేవి

ప్రజాశక్తి-పీలేరు

అంగన్వాడీ కార్యకర్తలు సామర్థ్యాభివృద్ధిని పెంచుకోవాలని జిల్లా ఐసిడిఎస్ పి. రమాదేవి తెలిపారు. అంగన్వాడీల్లో విద్యా నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండల స్థాయి అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న పోషణ్ భీ పఢైభీ రెండవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని పీడీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలను సుశిక్షితులైన కార్యకర్తలతో అభ్యాస కేంద్రాలుగా మార్చడానికి మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని అన్నారు. పిల్లల్లో భౌతిక, మేధో, ప్రారంభ భాష, సామాజిక భావోద్వేగం, సాంస్కృతిక సౌకర్యాభివృద్ధి, అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రం మెరుగుపరచడానికి కృషి చేస్తున్నామని అన్నారు. ప్రయత్నిస్తున్నామన్నారు. ప్రధానంగా 0 నుంచి 3 సంవత్సరాల వయస్సు పిల్లలకు ప్రారంభ ఉద్దీపన, దివ్యాంగ పిల్లలతో సహా 3 నుంచి 6 సంవత్సరాల వయస్సు పిల్లలకు బాల్య సంరక్షణ, విద్యను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఇసిసిఇ పాఠ్యాంశాలు, బోధనా విధానాలపై ప్రాథమిక అవగాహనతో అంగాన్వాడీ కార్యకర్తల సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, పోషన్‌లో ఆవిష్కరణలు, పోషన్ ట్రాకర్, ఫీడింగ్ పద్ధతులు, సూక్ష్మపోషక లోపాలు మొదలైన వాటితో సహా పోషకాహారంపై అంగన్వాడీ కార్యకర్తల అవగాహనను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడనుందని అన్నారు. కార్యక్రమంలో పీలేరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ రాజమ్మ, సూపర్వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కయ్య, ఉమ అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతపల్లిలె పోషణభీ పఢైభీ మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు అంగన్వాడీ కార్యకర్తలు అందరికీ సిడిపిఒ సౌభాగ్యమ్మ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవచేతన, ఆదర్శిలో భాగంగా సూక్ష్మ తూల పోషకాల గురించి తల్లి పాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సరళాదేవి, సూపర్వైజర్లు మణెమ్మ, నిర్మలా దేవి, జయ లక్ష్మమ్మ, రత్నమ్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ రమాదేవి

భారీగా పోలీసుల బదిలీలు

ప్రజాశక్తి-కలకడ

మండల కేంద్రమైన కలకడ పోలీస్ స్టేషన్లో భారీ స్థాయిలో బదిలీలు జరిగాయి. కలకడ సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న ఎఎస్ఐ ఉమర్‌అలీ పీలేరుకు బదిలీపై వెళ్లారు. కలకడకు పీలేరు నుంచి మల్లికార్జున, నందలూరు నుంచి శంకర్‌నాయక్ బదిలీపై కలకడకు ఎఎస్ఐలుగా వచ్చినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. ఇక్కడ పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్లు సునీల్ శశి కుమార్ పీలేరుకు, రెడ్డిబాబు కలికిరికి, నాగరాజా మదనపల్లి రెండవ పోలీస్ స్టేషన్‌కు, రాజేష్ బాబు సైబర్ క్రైమ్ కు బదిలీ అయినట్లు తెలిపారు. వీరి స్థానంలో మదనపల్లి ఒకటవ పోలీస్ స్టేషన్ నుంచి సి.శ్రీనివాసులు, మన్నూరు నుంచి అబ్దుల్ ముజీర్, మదనపల్లి రెండవ పోలీస్ స్టేషన్ నుంచి ఎం.శ్రీనివాసులు హెడ్ కానిస్టేబుల్‌గా కలకడకు వచ్చినట్టు తెలిపారు. కలకడ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న పోలీసులు ముత్యాలు రాయచోటికి, లక్ష్మీనారాయణ, మునిరాజా, యోగేష్, రియాజ్ భాష మదనపల్లి రెండవ పోలీస్ స్టేషన్‌కు, మహబూబ్‌బాషా, కె.రమేష్ మదనపల్లి మొదటి పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లినట్లు తెలిపారు. వీరి స్థానంలో రాయచోటి నుంచి నరేంద్ర, ప్రసాద్ పీలేరు నుంచి సుబ్రహ్మణ్యం, మదనపల్లి రెండవ పోలీస్ స్టేషన్ నుంచి హరికుమార్, పెద్దతిప్ప సముద్రంనుంచి భద్రయ్య, పుల్లంపేట నుంచి రామకృష్ణారెడ్డి కలకడకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. వీరు స్థానిక పోలీసు స్టేషన్లలో రిపోర్టులు చేసుకోనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిమ్మనపల్లిలో 13 మంది..

నిమ్మనపల్లె : శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పోలీసు శాఖలో ప్రక్షాళన మొదలు పెట్టింది. గత కొన్ని సంవత్సరాలుగా ఒకే చోట పనిచేస్తున్న పోలీసు అధికారులను బదిలీ చేస్తూ, తక్షణం వారు బదిలీ అయిన చోట బాధ్యతలు చేపట్టాలని ఆదేశించింది. ఆ మేరకు జిల్లా పోలీసు యంత్రాంగం నుంచి పోలీసు స్టేషన్లకు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిప్పేస్వామిని వివరణ కోరగా నిమ్మనపల్లి పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు, హెడ్ కానిస్టేబుల్స్, 9 మంది, కానిస్టేబుల్స్ మొత్తం 13 మంది పోలీసు సిబ్బంది బదిలీ కాగా, వారి స్థానంలో ఐదుగురు హెడ్ కానిస్టేబుల్స్, 10 మంది కానిస్టేబుల్స్ మొత్తం 15 మంది పోలీసు సిబ్బంది శుక్రవారం నిమ్మనపల్లి పోలీసుస్టేషన్‌లో బాధ్యతలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు నూతన సిబ్బందితో పటిష్ట చర్యలు చేపడతామని అన్నారు.



బి.కొత్తకోట : సన్మానం పొందిన పోలీసు సిబ్బందితో సిఐ జీవన్‌గంగానాథ్‌బాబు

సిబ్బందికి ఘనసన్మానం

బి.కొత్తకోట : తంబళ్లపల్లి నియోజకవర్గం,బి.కొత్తకోట పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్న పోలీసు సిబ్బందిని సిఐ జీవన్ గంగానాథ్‌బాబు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బి.కొత్తకోట యుజి స్టేషన్ నుంచి ఒకేసారి 12మంది బదిలీ కావడం బాధాకరమన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు స్థానచలనం సాధారణమేనని అన్నారు. బదిలీపై వెళ్తున్న సిబ్బంది విధులు పట్ల ఎంతో అంకితభావంతో పనిచేశారని కొని యాడారు.వారు ప్రస్తుతం వెళుతున్న స్టేషన్లలో ఇదే తరహాలో పనిచేసి ప్రజల ప్రశంసలు అందుకోవాలని సూచించారు. బదిలీపై వెళ్తున్న వారిలో ఇద్దరు ఎఎస్ఐలు బొజ్జనాయక్, నరసింహులు నాయక్,హెడ్ కానిస్టేబుల్స్ రెడ్డప్ప నాయక్, నాగరాజ్‌గౌడ్, రవీందర్‌నాయక్, కానిస్టేబుల్ నాగేంద్ర, సురేంద్ర, మారుతిప్రసాద్, వెంకటరమణ, శేఖర్, జబిఉల్లా, లక్ష్మీనారాయణ ఉన్నారు. **గాలివీడు :** స్థానిక పోలీస్ స్టేషన్‌లో పనిచేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందికి ఎస్ఐ పి.రామకృష్ణ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పూలమాలలతో దుశ్శాలుతో సన్మానించి స్వీట్లుపంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ బదిలీలు సర్వసాధారణమేనని అన్నారు. బదిలీపై వెళుతున్న సిబ్బంది అంకిత భావంతో పనిచేశారని అభినందించారు. అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. సన్మానం పొందిన వారిలో ఎఎస్ఐ టివి.రమణ, పిసిలు రామానుజులు, మదన్మోహన్, రమేష్, పురుషోత్తం సన్మానించిన వారిలో గణపతి, కాంతారావు పాల్గొన్నారు

అట్టహాసంగా ప్రారంభమైన జెఎన్‌టియు గేమ్స్ మీట్

ప్రజాశక్తి-కలికిరి

జెఎన్‌టియుఎ 12వ ఇంటర్ కొలీజియట్ గేమ్స్ మీట్-2025 కలికిరి జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెఎన్‌ఇయుఎ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రొఫెసర్ టి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొని, విజయం సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. క్రీడలు నిర్వహణకు ఏర్పాట్లు చేసిన ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావును, వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ త్యాగరాజన్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రొఫెసర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరుగునున్న గేమ్స్ మీట్‌కు రాష్ట్రవ్యాప్తంగా 29 కళాశాలల నుంచి సుమారు 830 మందికి పైగా క్రీడాకారులు పాల్గొంటున్నారని అన్నారు. వాలీబాల్, త్రో బాల్, ఖోఖో, హ్యాండ్ బాల్, షటిల్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ వంటి 6 రకాల క్రీడా పోటీలు జరుగుతున్నాయని అన్నారు. వాలీబాల్ పోటీలకు 20 జట్లు, త్రో బాల్ పోటీలకు 17 జట్లు, ఖోఖో పోటీలకు 12 జట్లు, హ్యాండ్ బాల్ పోటీలకు 10 జట్లు, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు 8 జట్లు, టేబుల్ టెన్నిస్ పోటీలకు 8 జట్లు రావటం జరిగిందన్నారు. ఈ క్రీడా పోటీలు ఆదివారం వరకు జరుగుతాయని తెలిపారు. వివిధ క్రీడలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ముగింపు కార్యక్రమంలో అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేన్సర్‌పై విజయం..స్క్రీనింగ్‌తోనే సాధ్యం

ప్రజాశక్తి-కలికిరి

కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్ తోనే సాధ్యమని ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ , టిబి పర్యవేక్షకులు నాగిరెడ్డి పేర్కొన్నారు. ఇంటింటి కేన్సర్ సర్వేలో భాగంగా కలికిరి ఎంఆర్‌సిలో కేన్సర్‌పై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహనా సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్ఒ ఆదేశాల మేరకు ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీ అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకర జీవనసైలి, ప్రవర్తనతో కేన్సర్‌ను నియంత్రణ చేయవచ్చని అన్నారు. ఇప్పటికే గత సంవత్సరం నవంబర్ 15 నుంచి ఇంటింటి కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గుట్కా, పోగాకు త్రాగడం, మద్యపానము సేవించడం, ఎక్కువగా గర్భ నిరోధక మాత్రలు మింగడం వల్ల, కొన్నిరకాల ఇన్ఫెక్షన్ వల్ల, వ్యాధినిరోధక శక్తి చాలా తక్కువగా ఉండటం వల్ల, కొన్ని జన్యు సంబంధ కారణాల వల్ల, ఊభాకాయం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. అనంతరం నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయడం జరిగింది. కార్యక్రమం లో ఎస్‌టిఎస్. నాగిరెడ్డి, ఐసిడి ఎస్ పర్యవేక్షకులు అరుంధతి, సర్తజ్, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

అడవులే మానవులకు జీవనాధారం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని గలవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా అటవీ దినోత్సవం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామంలో ఉన్న పురాతన చెట్లను సందర్శించి చెట్ల ప్రాముఖ్యతను తెలుపుతూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. చెట్ల చుట్టూ మానవహారంగా నిలబడి మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రమణ మాట్లాడుతూ అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. అడవులను సంరక్షించుకుందామని కోరారు.

ఉమ్మడి కడప జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్

ప్రజాశక్తి-నందలూరు

షంషేర్ సెటిల్ గ్రూప్ ఆధ్వర్యంలో ఈనెల 30, 31 తేదీలలో అన్నమయ్య, కడప జిల్లా స్థాయిలో బ్యాట్మెంటన్ డబుల్స్ నాన్ మెడలిస్ట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ నందలూరు రైల్వే కేంద్రంలోని సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ కార్యాలయంలో టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 29వ తేదీ లోపల తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.7 వేలు, రెండవ బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేలు, నాలుగవ బహుమతి రూ. 2 వేలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు.

కెజిబివి ఎస్ఒ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం

ప్రజాశక్తి-రామసముద్రం

రామసముద్రం మండల కెజిబివి పాఠశాలలో 6,9,11,12 తరగతులలో కాలిగా ఉన్న సీట్లు భర్తీ ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం 5 రోజుల క్రితం నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఎస్ఒ మస్తాన్‌బీ ఇప్పటి వరకు అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. రామసముద్రం కెజిబివిలో వచ్చే విద్యా సంవత్సరం ఖాళీలు ఉన్నాయా లేవా అనే అయోమయంలో ఆశవహ తల్లిదండ్రులు ఉన్నారు. ఈ విషయంపై సిజిడిఒ చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె

మండల కేంద్రంలోని సొసైటీ బిల్డింగ్ వద్ద మనోజ్‌క్లినిక్ ఆధ్వర్యంలో ఉచితవైద్య శిబిరం జరుగుతుందని ఆర్‌ఎంపీ డాక్టర్ రామాంజులు తెలిపారు. మదనపల్లి శ్రీ చిన్నపిల్లలు, మరియు జనరల్ హాస్పిటల్, డాక్టర్లు సుబ్రహ్మణ్యం, రేవతి, జోష్నా వెటర్నరీ జనరల్ హాస్పిటల్ డాక్టర్ జోష్ణ రాయల్ శిబిరానికి హాజరవుతారన్నారు. చిన్నపిల్లలకు బీపీ మరియు షుగర్ కు ఉచితంగా వైద్య చికిత్సలు చేస్తారన్నారు. గర్భిణీ సమస్యలు, రుతుక్రమ సమస్యలు, తెల్లబట్ట, పేగు జారుట వంటి సమస్యలపై వైద్య చికిత్సలు అందించి మందులు అందజేస్తారన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


24న బస్టాండ్ గేట్ వేలంపాట

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశపు హాల్లో ఈనెల 24న బస్టాండ్ గేటు వేలం పాట జరుగుతుందని సర్పంచ్ నీలుఫర్ , పంచాయతీ కార్యదర్శి రామకృష్ణులు తెలిపారు. ఉదయం 11 గంటలకు వేలం పాట జరుగుతుందని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనేవారు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

అటవీశాఖ అధికారులకు నెమలి అప్పగింత

ప్రజాశక్తి-గాలివీడు



నెమలిని పోలీసులకు అప్పగిస్తున్న వెంకటరమణ

స్థానిక పోలీసుస్టేషన్‌లో శుక్రవారం జాతీయ పక్షి నెమలిని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ విజయమ్మకు అప్పగించారు. సిసిపల్లిలోని వడ్డేపల్లి వద్ద శుక్రవారం నెమలిపై కుక్క దాడి చేస్తుండగా వెంకటరమణ స్థానికుడు గుర్తించి కుక్కను తరిమి నెమలిని పట్టుకొని వచ్చి స్థానిక పోలీసు స్టేషన్‌లో అప్పగించారు. నెమలికి కొద్దిగా గాయపడటంతో స్థానిక పశువైద్యులు డాక్టర్ భాస్కర్ దగ్గరకు వెళ్లి నెమలికి చికిత్స చేయించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, రమణ, కాంతారావు, షఫీ, గణపతిరాజు పాల్గొన్నారు.



బాధితులకు చెక్కును అందిస్తున్న జగన్‌మోహన్‌రాజు

పేదలకు వరం సిఎం సహాయనిధి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేటఅర్బన్

అనారోగ్యాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధిత కుటుంబాలకు భరోసాగా సిఎం సహాయ నిధి నిలుస్తుందని రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. శుక్రవారం రాజంపేట క్యాంప్ కార్యాలయంలో డేరంగుల అరుణ బాధిత కుటుంబానికి రూ.9,07,696లు సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం విద్య, వైద్యం అనేది చాలా ఖర్చుతో కూడుకున్న పని అని అన్నారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి అనారోగ్య బారిన పడితే మొత్తం కుటుంబానికి ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఉందని, అలాంటి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందించే సిఎం సహాయ నిధి ఆసరాగా నిలుస్తుందని అన్నారు. బాధితులు మాట్లాడుతూ వైద్యం కోసం అప్పులు చేసి మరీ ఆర్థిక ఇబ్బందులు పడ్డామని, తమకు చేయూతను అందించిన ప్రభుత్వానికి, తమకు సహకరించిన జగన్‌మోహన్‌రాజుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

5వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కురబలకోట మండలం,స్థానిక చేనేత నగరులోని మహాత్మ జ్యోతిబాపూలే 2025-26 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష్ మీడియంలో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 25వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ రామాంజనేయ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అడ్మిషన్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రాతిపదికగా దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్నీ వివరాలకు 9346183057నెంబర్ ద్వారాగానీ లేదా చేనేతనగర్‌లోని మహాత్మ జ్యోతిబా పాఠశాలను సందర్శించి సమాచారాన్ని తెలుసుకోగలరని తెలియపరిచారు. మండలంలోని నాలుగో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి

- రోడ్డుపై బైఠాయించి మృతుడి బంధువుల నిరసన

ప్రజాశక్తి మదనపల్లె అర్బన్



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న మృతుడి బంధువులు

ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యంపై మృతుడి బంధువులు శుక్రవారం రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తోరోకో చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం సాయంత్రం తమ కుటుంబ సభ్యుడు మౌలాలి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడితే ఆస్పత్రికి తీసుకొచ్చామని తెలిపారు.. ఇక్కడ వైద్యులు సకాలంలో స్పందించకుండా, చికిత్స అందించకపోవడంతోనే మృతి చెందాడని ఆరోపించారు. నిర్లక్ష్యం వహించిన వైద్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గంటల కొద్దీ రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలు ఆగిపోయి ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ఎంత నచ్చ జెప్పినా వినలేదు. ఈ మేరకు ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటీశ్వరి, ఆర్ఎంఒ షకూర్ ఆందోళన కారుల వద్దకు వచ్చి నిర్లక్ష్యం వహించిన వైద్యులపై శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

క్రైం కార్నర్

టిప్పర్, కంటైనర్ ఢీ

- ఒకరుమృతి : మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి-పుల్లంపేట

కడప-రేణిగుంట జాతీయ రహదారిపై పుల్లంపేట మండలం ఎపి మోడల్ స్కూల్ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టిప్పర్, కంటైనర్ ఢీకొనడంతో టిప్పర్ డ్రైవర్ మృతిచెందగా కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజంపేట మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన చీమకుర్తి శివ(35) టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం మంగపేట నుంచి టిప్పర్‌లో రాజంపేటకు వస్తుండగా ఎదురుగా వెళ్తున్న వాహనాన్ని ఓవర్టేక్ చేయబోయి ఎదురుగా గుజరాత్ నుంచి చెన్నై వెళుతున్న కంటైనర్ ను బలంగా ఢీ కొనడంతో శివ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. కంటైనర్ డ్రైవర్ పాండు తీవ్రంగా గాయపడ్డాడు. ఎఎస్‌పి రామ్‌నాథ్ హెగ్డే, రూరల్ సిఐ రమణ, పుల్లంపేట ఎఎస్ఐ పిచ్చయ్య తమ సిబ్బందితో సంఘటన జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడ్డ కంటైనర్ డ్రైవర్ పాండును రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. శివ మృతదేహం టిప్పర్ లో ఇరుక్కుపోవడంతో జెసిబి సహాయంతో వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రెండు భారీ వాహనాలు ఢీకొని రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో సుమారు మూడు గంటలసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఎఎస్‌పి, సిఐలు, ఎఎస్ఐ దగ్గరుండి జెసిపిల సహాయంతో రెండు వాహనాలను పక్కన పక్కకు తొలగించి ట్రాఫిక్ ను పునరుద్ధరించారు. ఈఘటనపై కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

- పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

అదనపు కట్నం కోసం భర్తతో పాటు అత్త, మామ, ఆడపడచు వేధిస్తున్నారని లలితమ్మ అనే మహిళ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.మండలంలోని సంపతికోట పంచాయతీ, ముంతపోగులవారిపల్లికి చెందిన కోనకుంట రాయుడు కుమార్తె లలితమ్మకు కర్ణాటక రాష్ట్రం చేలూరు సమీపంలోని గ్యాదోల్లపల్లికి చెందిన బంగారప్ప కుమారుడు క్రాంతి కుమారుతో నాలుగేళ్ళ క్రితం వివాహమైంది. మూడేళ్ళపాటు ఈ దంపతుల జీవనం సజావుగా సాగింది. ఈ దంపతులకు ఓ కుమార్తె సంతానం కాగా ఇటీవల మరో కుమార్తె జన్మనిచ్చింది. గత ఏడాది నుంచి తాను గర్భిణిగా ఉన్న తనను ఏమాత్రం పట్టించుకోకుండా మరో మహిళతో గుట్టుగా వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని ఆరోపిస్తూ లలితమ్మ భర్తపై నెల రోజుల క్రితం పిటిఎం పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పట్లో పోలీసులు భర్తతోపాటు వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపించేశారు. తన భర్తతోపాటు ఆమె కుటుంబ సభ్యులు నిత్యం అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నారని, అత్తామామ, ఆడపడచుతో పాటు తన భర్త అక్రమ సంబంధం పెట్టుకున్న మహిళపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళ లలితమ్మ పేర్కొంది. ఈ విషయంపై ఎస్ఐ హరిహర ప్రసాద్ మాట్లాడుతూ లలితమ్మ ఫిర్యాదు స్వీకరించి విచారణ చేపట్టామని బాధితురాలికి న్యాయం చేస్తామని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

ప్రజాశక్తి-చిన్నమండెం

రాయచోటి-మదనపల్లి జాతీయ రహదారి పైన చిన్నమండెం దగ్గర ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం లారీ, బైక్ ఢీకొన్న ఘటనలో వెలుగల్లుకు చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. రాయచోటి నుంచి తమ గ్రామానికి వెళుతున్న సమయంలో లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రుని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.